క్లుప్తంగా

ఉచిత విద్యకు దరఖాస్తుల ఆహ్వానం

కౌతాళం: ఉచిత విద్యకు దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాధికారులు వరప్రసాద్, శోభరాణి అన్నారు. విద్యా హక్కు చట్టం కింద మండలంలోని ప్రైవేట్ పాఠశాలల్లో 2024–25 ఒకటో తరగతిలో ప్రవేశాలకు cse. ap. gov. in వెబ్‌సైట్‌లో దరఖస్తు చేసుకోవాలన్నారు. అనాథలు, హెచ్ఐవీ బాధితులు, విభిన్న ప్రతిభావంతులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఓసీలో పేద వర్గాల పిల్లలకు వారి సమీప ప్రాంతంలోని ప్రైవేట్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో 25శాతం కోట కింద ప్రవేశాలు కల్పిస్తారన్నారు. అర్హులైన విద్యార్థులు ఆధార్‌కార్డు, ప్రాథమిక వివరాలతో ఈనెల 25వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. లాటరీ విధానం ద్వారా సీట్లు కేటాయిస్తారని తెలిపారు.

ముమ్మరంగా రోడ్డు నిర్మాణ పనులు



రోడ్డు పనులు చేయిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కోసిగి: మండల కేంద్రంలోని సిద్ధప్పపాళెం కాలనీలో కట్టబసప్ప ఆలయం వద్ద సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. గడప గడప మన ప్రభుత్వం నిధులు రూ.5లక్షలతో ఈ పనులు చేస్తున్నారు. రోడ్డు నిర్మాణానికి చొరవ తీసుకున్న ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీ మోహన్ రెడ్డికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు

కృష్ణగిరి: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండల పరిధిలోని చుంచుఎర్రగుడి గ్రామంలో శనివారం గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుల ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి పాలపాళ్ల ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు దాతలు, వైఎస్సార్‌సీపీ నాయకులు బీమిరెడ్డి, సంగాల గిడ్డయ్య తదితరులు తెలిపారు. ఈ పోటీలను పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి ప్రారంభిస్తారని చెప్పారు. గెలుపొందిన వృషభాల యజమానులకు వరుసగా రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలను అందించడం జరుగుతుందని, పోటీల్లో పాల్గొనే వారు రూ.500 ఎంట్రీఫీజు చెల్లించి పేరు నమోదు చేసుకోవాలన్నారు. పేర్ల నమోదుకు 94413 12075, 96401 18716 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

12న గ్రామ పంచాయతీ మార్కెట్ వేలాలు

ఆలూరు రూరల్: ఈ నెల 12న ఆలూరు పంచాయతీ పరిధిలోని మార్కెట్లకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఈఓపీఆర్డీ ప్రకాష్ నాయుడు శుక్రవారం వెల్లడించారు. స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ ఆవరణంలో ఉదయం 10.30 గంటలకు వేలాలు ప్రారంభమవుతాయని తెలిపారు. వేలాల్లో పాల్గొనేందుకు వారపు సంత మార్కెట్, దినసరి కూరగాయల మార్కెట్, బస్టాండ్ (ప్రైవేటు వాహనాల నుంచి పన్ను వసూలు) కోసం రూ.లక్ష ఇంటి విలువ సర్టిఫికెట్ లేదా రూ.2 లక్షలు డిపాజిట్ చెల్లించాలన్నారు. అలాగే గొర్రెలు, పశువుల వధశాల కోసం రూ.10 వేల డిపాజిట్‌ను గ్రామ పంచాయతీ కార్యాలయంలో చెల్లించాల్సి ఉందన్నారు. వేలం దక్కించుకున్న వారు 01.4.2024 నుండి 31.03.2025 వరకు రుసుములు వసూలు చేసుకునేందుకు అనుమతి ఉంటుందన్నారు. హెచ్చుపాటదారుడు వేలం ముగిసిన వెంటనే డిపాజిట్ సొమ్ము పోనూ మిగతా మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుందన్నారు.

వెండి కిరీటం విరాళం



రంగనాథ స్వామికి అందించిన వెండి కిరీటం

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలో ప్రసిద్ధి చెందిన శ్రీరంగనాథ స్వామి దేవాలయంలో స్వామి వారికి అదే గ్రామానికి చెందిన ఈడిగ రాజేంద్ర, గాయత్రి దంపతులు రూ.50 వేలు విలువ చేసే వెండి కిరీటాన్ని ఆలయ అధికారులు చంద్రశేఖర్ రెడ్డి, చైర్మన్ దస్తగిరి గౌడ్‌కు శుక్రవారం అందజేశారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

హొళగుంద: శివమాల ధరించి శ్రీశైల మల్లన్న దర్శనానికి వెళ్లి వస్తూ మృతి చెందిన పంచాయతీ కార్యలయంలోని కాంట్రాక్ట్ సిబ్బంది మల్లికార్జున కుటుంబాన్ని శుక్రవారం పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్, వైఎస్సార్‌సీపీ నాయకుడు పంపాపతి పరామర్శించారు. మల్లికార్జునకు భార్య శశికళ, కుమారుడు ఉన్నారు. పేద కుటుంబం కావడంతో చెత్త తరలింపు వాహనానికి కాంట్రాక్ట్ డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్న మల్లికార్జున అకాల మరణానికి గురికావడంతో శుక్రవారం ఆయన భార్య శశికళకు రూ.10 వేల ఆర్థిక సాయం అందజేసినట్లు సెక్రటరీ తెలిపారు.

సంక్షేమ పథం.. అభివృద్ధి ఘనం

- 20వ వార్డులో అభివృద్ధి పరుగులు
- బీటీ రోడ్లు, సీసీ రోడ్లు, డ్రెయినేజీ కాలువల ఏర్పాట్లు
- హర్షం వ్యక్తం చేస్తున్న కాలనీల ప్రజలు



దివాకర్‌రెడ్డి నగర్ వంక ఏరియాలో సీసీ రోడ్డు ,ఆర్టీసీ కాలనీలో అందంగా బీటీ రోడ్డు, మురుగు కాలువలు ఏర్పాటు చేసిన దృశ్యం

ఆదోనిటౌన్: ఆదోని మున్సిపాలిటీ పరిధిలో 20వ వార్డులో ప్రతి సందుసందున, వీధివీధిన బీటీ, సీసీ రోడ్లు, కల్వర్టులు వెలిశాయి. ప్రజలు ఎన్నో ఏళ్లుగా పడుతున్న రహదారి కష్టాలు తొలగిపోయావడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇది కదా అభివృద్ధి అని పేర్కొంటున్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో ఆదోని మున్సిపాలిటీలో ప్రతి వార్డులోనూ కోట్ల రూపాయల మేర అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు లబ్ధి చేకూరింది. ప్రజా సమస్యలు తెలిసిన ప్రభుత్వం ఇంతకన్నా మరొకటి లేదని ప్రజలు పేర్కొంటున్నారు. మరోసారి సీఎంగా వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని గెలిపించుకుని అభివృద్ధి, సంక్షేమాన్ని కొనసాగించుకుంటామని చెబుతున్నారు.

20వ వార్డు వివరాలు

- జనాభా – 3200 మంది
- పురుషులు – 1580, స్త్రీలు – 1620
- పింఛన్లు – 400
- వీధులు : ఆర్టీసీ కాలనీ, దివాకర్‌రెడ్డి నగర్, మండిగిరి, ఎల్‌ఐసీ కాలనీ

అభివృద్ధి పనుల వివరాలు

- దివాకర్‌రెడ్డి నగర్, ఎల్‌ఐసీ కాలనీల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా మంజూరైన రూ.20 లక్షలతో బీటీ రోడ్లు ఏర్పాటు చేశారు.
- దివాకర్‌రెడ్డి నగర్‌లో మురుగు కాలువ, విట్టా క్రిష్టప్ప నగర్‌లో మురుగు కాలువలు ఏర్పాటు చేశారు.
- మున్సిపల్ జనరల్ ఫండ్స్ రూ.40 లక్షలతో ఆర్టీసీ కాలనీలో బీటీ రోడ్లు ఏర్పాటు
- ఆదోని ఎంట్రన్స్ జైహింద్ వద్ద అమృత్ పథకం కింద రూ.20 లక్షలతో పార్కు ఏర్పాటు
- ఆర్టీసీ కాలనీ దివాకర్‌రెడ్డి నగర్‌లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, 17 విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు.

ప్రతిఒక్కరికీ లబ్ధి చేకూర్చారు



20వ వార్డులో గతంలో ఎన్నడూ చేయని విధంగా సందుసందులో సీసీ, బీటీ రోడ్లు వేశారు. వార్డ్ ఇన్‌చార్జ్ మధు, కౌన్సిలర్ మహాలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరిస్తున్నారు. గతంలో ఇలాంటి పరిపాలన ఎప్పుడూ చూడలేదు. సంక్షేమ పథకాల ద్వారా ప్రతిఒక్కరికీ లబ్ధి చేకూర్చారు.

– వెంకటేశులు, వార్డు ఇన్‌చార్జ్

రోడ్లు, కాలువలు వేశారు



గతంలో దివాకర్ రెడ్డి నగర్‌లో రోడ్డు లేక చాలా ఇబ్బందులు పడేవాళ్లం. మురుగు నీరు ఇళ్ల ముందే నిల్వ ఉండేది. సమస్యను ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లాం. స్పందించిన ఎమ్మెల్యే సీసీ రోడ్డు, మురుగు కాలువలను ఏర్పాటు చేశారు. ఏళ్ల నాటి సమస్యను పరిష్కరించారు. మరోమారు జగనన్న ప్రభుత్వానికే ఓటు వేస్తాం.

– జయమ్మ, గృహిణి, దివాకర్‌రెడ్డి నగర్

ప్రజల కష్టాలు తెలుసుకొని పరిష్కరిస్తున్నారు



20వ వార్డు మండిగిరి ఏరియాలో కౌన్సిలర్, పార్టీ కార్యకర్తలు, నాయకులు ప్రజల సమస్యలను తెలుసుకొని పరిష్కరిస్తున్నారు. ఎలాంటి సమస్య ఉన్నా వారి దృష్టికి తీసుకెళ్తే పరిష్కరిస్తున్నారు. పెద్ద సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి కొన్ని రోజుల్లోనే పరిష్కారమయ్యేలా చూస్తున్నారు. మా ఏరియాలో ప్రతి వీధిలోనూ రోడ్లు, కాలువలు వేశారు. జగనన్న పాలన బాగుంది.

– లక్ష్మి, మండిగిరి

వివిధ సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు చేకూరిన లబ్ధి

ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ) మొత్తం రూ.9,09,11,857

పథకం పేరు	లబ్ధిదారులసంఖ్య	అందించిన లబ్ధి (రూ.లలో)
జగనన్న అమ్మఒడి	310	1,35,31,600
జగనన్న విద్యాదీవెన	224	69,83,628
జగనన్న వసతిదీవెన	177	30,25,378
వైఎస్సార్ రైతు భరోసా	205	94,47,300
వైఎస్సార్ ఉచిత పంటల బీమా	130	38,73,057
వైఎస్సార్ సున్నావడ్డీ పంట రుణాల రైతులు	27	83,531
రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ	13	1,95,625
వైఎస్సార్ పెన్షన్ కానుక	368	3,23,53,500
వైఎస్సార్ చేయూత	161	67,87,500
వైఎస్సార్ ఆసరా	184	39,50,644
వైఎస్సార్ సున్నావడ్డీ	377	8,07,415
వైఎస్సార్ ఈబీసీ నేస్తం	22	5,85,000
వైఎస్సార్ కళ్యాణమస్తు/షాదీ తోఫా	02	1,75,000
డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ	89	26,50,510
వైఎస్సార్ ఆరోగ్య ఆసరా	48	2,52,125
హౌసింగ్ (లబ్ధిదారులకు నేరుగా చెల్లింపులు)	69	44,82,552
వైఎస్సార్ బీమా	2	4,30,000
వైఎస్సార్ వాహనమిత్ర	13	3,90,000
వైఎస్సార్ నేతన్న నేస్తం	-	-
జగనన్న చేదోడు	12	2,50,000
వైట్ కార్డు హోల్డర్లకు ప్రత్యేక కోవిడ్ సహాయం	640	6,40,000
జగనన్న తోడు (వడ్డీ)	54	17,492

పరోక్ష ప్రయోజనాలు (నాన్ డీబీటీ) మొత్తం : రూ.4,28,70,254

ఇంటి స్థలాలు	73	1,79,58,000
జగనన్న విద్యాకానుక	82	5,82,364
8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ	14	1,85,108
జగనన్నతోడు (రుణాలు)	96	17,87,424
జగనన్న గోరుముద్ద	86	8,52,002
వైఎస్సార్ సంపూర్ణ పోషణ	228	42,70,440
ఇంటింటికి రేషన్	789	1,72,34,916

డీబీటీ, నాన్ డీబీటీ మొత్తం : రూ.13,37,82,111

పేదల సొంతింటి కల సాకారం



ఇళ్ల రిజిస్ట్రేషన్ పత్రాలను పంపిణీ చేస్తున్న మనోజ్‌కుమార్ రెడ్డి

ఆదోనిటౌన్: వైఎస్సార్‌సీపీ పాలనలో పేదల సొంతింటి కల సాకారం అయ్యిందని యువ నాయకుడు మనోజ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆదోని మండలం నాగలాపురం గ్రామానికి చెందిన 130 మంది నిరుపేదలకు ఇళ్ల పట్టాలను స్థానిక పార్టీ కార్యాలయంలో పంపిణీ చేశారు. ఆ గ్రామ సర్పంచ్ కోట పరమేష్, మాజీ సర్పంచ్ వీరారెడ్డి ఆధ్వర్యంలో ఇళ్ల పట్టాల పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా మనోజ్‌కుమార్‌రెడ్డి మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా పేదలు సొంతిల్లు లేక అద్దె ఇళ్లు, గుడిసెల్లో అవస్థలు పడ్డారని, అలాంటి వారి కలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేశారని కొనియాడారు. పట్టాలు తీసుకున్న వారందరూ ఇంటి నిర్మాణం చేపడితే సాయం అందిస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు భీమన్న, గోపాల్, రామాంజనేయులు, ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం



సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎస్టీయూ నాయకులు

ఆదోనిసెంట్రల్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక ఎస్టీయూ భవనంలో సావిత్రి బాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. సమాజంలో మహిళలను గౌరవించడం ద్వారా వారికి సముచిత స్థానం కల్పిస్తూ వారు దేశ అభివృద్ధిలో భాగస్వామ్యం అయ్యేలా, వారికి మనమంతా అండగా ఉండాలని పిలుపునిచ్చారు. స్త్రీ లేని సమాజాన్ని ఊహించడం కష్టమని, మనిషి జీవితంలో ప్రతి దశలోనూ స్త్రీ భాగస్వామ్యం తప్పనిసరిగా ఉంటుందన్నారు. ఎస్టీయూ ఆదోని పట్టణ, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె.రవి, భీమరాజు, రామకృష్ణ, సుధాకర్‌బాబు, ఎస్టీయూ ఏపీ రాష్ట్ర సహాధ్యక్షులు నాగరాజు, రాష్ట్ర కౌన్సిలర్ మహాదేవప్ప, జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్‌నాయుడు, జిల్లా ఆర్థిక కమిటీ సభ్యులు రామాంజనేయులు, సత్యన్న, రాజా, సతీష్, ఈరన్నగౌడ్, సూర్యుడు, వెంకటేశ్వర్లు, వీరేష్, రామాంజనేయులు, గురురాజా, కోటి తదితరులు పాల్గొన్నారు.

ఆదోనిసెంట్రల్: ఆదోని పట్టణంలోని జీవనజ్యోతి ఆశ్రమంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వేడుకలు నిర్వహించినట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీను తెలిపారు. ఈ సందర్భంగా వారు ఆశ్రమంలోని మహిళలను ఘనంగా సన్మానించారు. అనంతరం అక్కడున్న వారందరికీ కేసరి (స్వీట్), కారా మిక్చర్ అందించారు. ఎస్ఎఫ్ఐ నాయకులు నాగరాజు, దినేష్, పవన్, యశ్వంత్ పాల్గొన్నారు.

రాఘవేంద్రపురంలో విద్యుత్ ప్రమాదం



ఇంటి నుంచి వెలువడుతున్న పొగ, బాధితులతో మాట్లాడుతున్న వై.సీతారామిరెడ్డి

- బాధితులకు రూ. 25వేల ఆర్థిక సాయం

మంత్రాలయం: మండల కేంద్రంలోని రాఘవేంద్రపురంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఓ ఇంట్లో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. రూ.7 లక్షల మేర ఆస్తి నష్టం జరిగి ఉంటుందని పోలీసుల అంచనా. వివరాలు.. రాఘవేంద్రపురానికి చెందిన వైభవ్ ఆచారి కుటుంబ సభ్యులు మహాశివరాత్రి సందర్భంగా కర్ణాటకలోని కొప్పల్ క్షేత్రానికి వెళ్లారు. ఉదయం ఇంట్లోని బెడ్ రూంలో షార్ట్ సర్క్యూట్ చోటుచేసుకుంది. మంటలు చెలరేగి ఇంట్లోనే రెండు ఎయిర్ కూలర్‌లు, రెండు రిఫ్రిజిరేటర్‌లు, ఆస్తి పత్రాలు, రూ.70వేల నగదు పూర్తిగా కాలిపోయింది. ఫర్నిచర్‌తో పాటు వంటగదిలోని వస్తువులు కాలిబూడిదయ్యాయి. అదే సమయంలో విద్యుత్ ప్రవాహంలో వ్యత్యాసాలు రావడంతో కాలనీలోని 30 మంది ఇళ్లలో టీవీలు, ఫ్రిజ్‌లు చెడిపోయాయి. విషయం తెలుసుకున్న ఎస్ఐ గోపినాథ్ సంఘటనా స్థలానికి చేరుకుని ఎమ్మిగనూరు నుంచి అగ్నిమాపక వాహనాన్ని రప్పించి మంటలను అదుపులో తెచ్చారు. బాధితులు కన్నీరుమున్నీరయ్యారు.

బాధితులకు ఆర్థిక సాయం

వైభవ్ ఆచారి కుటుంబ సభ్యులను ఇంటికి టీటీడీ పాలక మండలి సభ్యుడు వై. సీతారామిరెడ్డి పరామర్శించారు. రూ.25వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆయనతో పాటు నాయకులు భీమారెడ్డి, మల్లికార్జున, జనార్ధన్‌రెడ్డి, శివకుమార్, గోరుకల్లు స్వామి తదితరులు ఉన్నారు.

రేపు గురుకుల ప్రవేశ పరీక్ష

కృష్ణగిరి: మండల పరిధిలోని కంబాలపాడు గ్రామ సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో ఆదివారం ఐదవ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ప్రవేశ పరీక్ష ఉంటుందని ప్రిన్సిపాల్ సుజాత శుక్రవారం తెలిపారు. ఉదయం 10 గంటలకు ఐదవ తరగతి విద్యార్థులకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు పరీక్ష ఉంటుందని తెలిపారు. విద్యార్థులు హాల్‌టికెట్, ఒరిజినల్ ఆధార్ కార్డుతో గంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

వెండి తొడుగు అందజేత

పాణ్యం: మండలంలోని తమ్మరాజుపల్లె గ్రామ శివాలయంలో వెలసిన శివలింగానికి ఓ దాత వెండి తొడుగును బహూకరించారు. గ్రామానికి చెందిన వాసగిరి తిమ్మయ్య అర్చకుడుగా పని చేశాడు. ఆయన మరణాంతరం కుటుంబ సభ్యులు ఇతర దేశాల్లో స్థిరపడ్డారు. స్వగ్రామంలోని మహాశివుడికి ఆయన భార్య వాసగిరి సావిత్రి, కుమార్తె లక్ష్మీదేవి శుక్రవారం మహాశివరాత్రిని పురస్కరించుకొని కేజిన్నర వెండితో చేయించిన తొడుగును అందజేశారు. అర్చకులు కిట్టయ్యశర్మ ఆధ్వర్యంలో విశేష పూజలు చేశారు.



ఆదోనిలో కార్లపై శివలింగాన్ని ఉంచి ఊరేగిస్తున్న దృశ్యం, టిప్పర్ టాపుపై శివలింగాన్ని ఉంచి ఊరేగింపును ప్రారంభిస్తున్న నిర్వాహకులు

హరహర మహాదేవ.. శంభో శంకర

- శివనామస్మరణతో మార్మోగిన శివాలయాలు
- ఘనంగా మహాశివరాత్రి వేడుకలు
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు



కౌతాళం: పూజలందుకుంటున్న త్రంభకేశ్వరస్వామి, కౌతాళం: మేళిగనూరు రామలింగేశ్వరుడు

ఆదోనిటౌన్/ఆదోని రూరల్: హరహర శంభో శంకరా.. ఓం నమఃశివాయ నామస్మరణతో శివాలయాలు మార్మోగాయి. శుక్రవారం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామివారికి పంచామృతాభిషేకం, జలాభిషేకం, కుంకుమార్చన, మహామంగళహారతి, హోమాలు తదితర విశేష పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆలయాలు కిటకిటలాడాయి. ఆదోని పట్టణంలోని శంభులింగేశ్వర స్వామి, బోయగేరిలో వెలిసిన చంద్రమౌళేశ్వర స్వామి, మున్సిపల్ క్రీడా మైదానంలో వెలిసిన బన్ని మహంకాళి దేవాలయ ఆవరణలోని శివాలయం, ఎరుకల కాలనీ సమీపంలో వెలిసిన శివపార్వతుల దేవాలయం, క్రాంతినగర్, ఇందిరానగర్, ఆర్టీసీ కాలనీ, ఆదోని పట్టణంలోని వాల్మీకినగర్‌లోని గోరఖ్‌నాథ్ మఠంలోని త్రయంబకేశ్వర్ మహామృత్యుంజయ మంజునాథ స్వామి, శ్రీశాంతమల్లప్ప కొండలో వెలిసిన శాంత మల్లేశ్వరస్వామి దేవాలయంతో పాటు ఆయా శివాలయాల్లో శివరాత్రి వేడుకలను ఘనంగా చేపట్టారు. ఉదయం నుంచి స్వామివార్లకు జలాభిషేకం, పంచామృతాభిషేకం, కుంకుమార్చన, మహామంగళహారతి తదితర విశేష పూజలు నిర్వహించారు. భక్తులు ఉపవాస దీక్ష పాటించారు. భక్తిశ్రద్ధలతో పరమ శివుడిని ఆరాధించారు. అలాగే ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో టిప్పర్ టాపుపై, కార్ల టాపుపై శివలింగాన్ని ఉంచి ఆదోని ప్రధాన రహదారులైన ఎమ్మిగనూరు రోడ్డు, శ్రీనివాస్ భవన్ మీదుగా ర్యాలీ నిర్వహించారు.

– ఆదోని మండలంలోని పెద్దహరివాణం, పెద్దతుంబళం, సంతెకూడ్లూరు, చిన్నహరివాణం, మండిగిరి, దొడ్డనగేరి, పెసలబండ, ధణాపురం, నాగనాథనహళ్లి, మండిగిరిలోని పంచలింగేశ్వర స్వామి దేవాలయం, శివాలయాల్లో మహాశివరాత్రి వేడుకలను ప్రజలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామివారికి విశేష పూజలు చేసి మొక్కుబడులు తీర్చుకున్నారు. భక్తులకు ఆయా ఆలయాల్లో అన్నదానం నిర్వహించారు.



శంభులింగేశ్వరస్వామి ఆలయం ముందు భక్తుల క్యూ

– ఆదోని పట్టణంలోని ప్రజాప్రతిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో శివరాత్రి వేడుకలను నిర్వహించారు. ఈశ్వరుడి ప్రతిమను గ్రామ పురవీధులగుండా ఊరేగించారు. శివుడి జీవిత విశేషాలను ప్రజలకు తెలియజేస్తూ ముందుకు కదిలారు.

కౌతాళం: మండలంలోని మేళిగనూరులో ఉన్న రామలింగేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. తుంగభద్ర నది వద్ద పుణ్యస్నానాలు ఆచారించి స్వామివారికి అభిషేక పూజలు నిర్వహించారు. అలాగే మండల పరిధిలోని ఎరిగేరిలోని పులిగొట్టు ఆజనేయస్వామి, బసవేశ్వరస్వామి ఆలయం, బదినేహాల్ మల్లికార్జునస్వామి, రొడూరు జట్టిప్పతాత ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. కౌతాళంలోని త్రయంబకేశ్వరస్వామి ఆలయంలో భక్తులు బారులు తీరారు. భక్తులకు అన్నదానం చేశారు.

ఘనంగా మహా శివరాత్రి వేడుకలు

కోసిగి: మండలంలోని శివాలయం, మార్కండేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే తుంగభద్ర నది ఒడ్డున వెలసిన కందుకూరు రామలింగేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి అభిషేకాలు, అర్చనలు చేశారు. కర్ణాటక రాష్ట్రం రాయచూర్ రూరల్ ఎమ్మెల్యే గద్దలం బసవన్న గౌడ స్వామివారిని దర్శించుకున్నారు. అయనకు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బెట్టన గౌడ ఆహ్వానం పలికి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

పెద్దకడబూరు:మండల కేంద్రంలోని మల్లికార్జునస్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి శివపార్వతుల కల్యాణం కనుల పండువగా జరిగింది. మండలంలోని చిన్నతుంబళం రామలింగేశ్వరస్వామి, బాపురం గంగాభవానిమాత, పెద్దకడబూరులోని సిద్ధారూఢస్వామి, దొడ్డిమేకల చంద్రమౌళేశ్వరస్వామి, హెచ్.మురవణి ఉమామహేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులు శివయ్యకు అత్యంత ప్రీతికరమైన బెల్లం పానం, గుగ్గిళ్లతో నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం సిద్ధారూఢ స్వామి వారి ప్రభోత్సవం వేడుకగా నిర్వహించారు.

నేడు రథోత్సవం

మండలంలోని దొడ్డిమేకల చంద్రమౌళేశ్వరస్వామి, హెచ్.మురవణిలోని ఉమా మహేశ్వరస్వామి ఆలయాల్లో శనివారం రథోత్సవం నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు, నిర్వాహకులు తెలిపారు.



కోసిగి: స్వామి సన్నిధిలో రాయచూర్ రూరల్ ఎమ్మెల్యే బసవన్న గౌడ




కౌతాళంలోని ఆలయం వద్ద భక్తుల సందడి



రామలింగేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

కర్ణాటక మద్యం స్వాధీనం



పట్టుబడిన కర్ణాటక మద్యంతో ఆలూరు పోలీసులు

ఆలూరు రూరల్: అక్రమంగా నిల్వ ఉంచిన రూ.95 వేల విలువైన కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఆలూరు ఎస్ఐ ఓబులేసు తెలిపారు. శుక్రవారం స్థానిక పోలీసు స్టేషన్ ఆవరణలో సీఐ వెంకటేశ్వర్లు సమక్షంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమకు వచ్చిన సమాచారం మేరకు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలో సోదాలు నిర్వహించగా.. గడ్డివాములో అక్రమంగా నిల్వఉంచిన 15 బాక్సుల (1,440 టెట్రా ప్యాకెట్లు 90 ఎంఎల్) మద్యం స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. నిల్వ ఉంచిన మద్యం పట్టణానికి చెందిన హంపయ్యకు చెందినదిగా గుర్తించామన్నారు. నిందితుడు పరారీలో ఉన్నాడని చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ ఓబులేసు తెలిపారు. తనిఖీలలో సిబ్బంది నెల్లూరప్ప, నాగేష్ పాల్గొన్నారు.